సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 13 । జనవరి । 2025



లంబసింగికి పర్యాటకులు పోటెత్తారు. ఆదివారం తెల్లవారుజామునుంచి సందర్శకుల రాక మొదలైంది. ఇక్కడికి సమీపంలోని చెరువుల వేనం వ్యూపాయింట్ వద్ద పాలసముద్రాన్ని తలపించే మంచు అందాలను చూసి మురిసిపోయారు. – చింతపల్లి

న్యూస్‌రీల్

వణికిస్తున్న చలిగాలులు

- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- జి.మాడుగులలో 6.2 డిగ్రీల నమోదు



చింతపల్లిలో భారీగా కురుస్తున్న పొగమంచు

చింతపల్లి: మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. చలిగాలులు వణికిస్తున్నాయి. ఆదివారం జి.మాడుగులలో 6.2 డిగ్రీలు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ పరిధి అరకు వేలిలో 7.7 ,డుంబ్రిగుడలో 7.8, చింతపల్లిలో 8.2, జీకేవీధిలో 8.5, హుకుంపేటలో 8.6, పాడేరులో 9.0, పెదబయలులో 9.3 డిగ్రీలు, కొయ్యూరులో 12.4, అనంతగిరిలో 13.3 డిగ్రీలు నమోదు అయినట్లు ఆయన తెలిపారు. ఉదయం 10 గంటలు వరకూ మంచు అధికంగా కురవడంతో వాహన చోదకులు లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగించారు.

విద్యుత్‌చార్జీల పెంపుపై నేడు నిరసన

- సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

పాడేరు రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఈనెల 13న సీపీఎం మేరకు భోగి మంటలో విద్యుత్ బిల్లులు దగ్ధం చేస్తున్నట్టు ఆ పార్టీ పార్టీ సిల్లా కార్యదర్శి అప్పలనర్స తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా అధికారంలో వచ్చిన తరువాత విద్యుత్ చార్జీలు పెంచి సామాన్య ప్రజలపై తీవ్రమైన భారం మోపిందన్నారు. అంతేకాకుండా పాత విద్యుత్ మీటర్లు తొలగించి కొత్తగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీంతో ప్రజలందరికీ మరింత ఇబ్బందులు వస్తాయన్నారు. నూతన విధానాలతో ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా పాత విధానంలోనే విద్యుత్ అందించాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న పశువుల కంటెయినర్

చింతూరు: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు కంటెయినర్‌లో అక్రమంగా తరలిస్తున్న 84 పశువులను కల్లేరులో స్వాధీనం చేసుకున్నట్లు చింతూరు ఎస్ఐ రమేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. పశువులను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం కల్లేరులో వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు. పశువులను తరలిస్తున్న కంటెయినర్‌ను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

మన్యం కప్ ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం



టోర్నమెంటులో పాల్గొంటున్న ఫుట్‌బాల్ క్రీడాకారులు

చింతూరు: ఆల్ ఇండియా ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంటులో భాగంగా మన్యంకప్ సీజన్–2 ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం చింతూరులో ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్లో ఆంధ్రా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాకు చెందిన పలు జట్లు పాల్గొంటున్నాయి. టోర్నమెంటు విజేతకు జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలను వీఆర్ పురం జెడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, మూడో బహుమతి రూ.15 వేలను ఏఎస్‌డీఎస్ సంస్థ అధ్యక్షుడు గాంధీబాబు అందచేయనున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ఇమ్రాన్‌ఖాన్, నాయకులు పాయం వెంకయ్య, రమణారెడ్డి, శ్రీనివాసరావు, వెంకట్, ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పూనెం కిరణ్‌కుమార్, సాయి వెంకటరమణ, రాజ్‌కుమార్, అర్జున్ పాల్గొన్నారు.

రూ.లక్ష కూడా అమ్ముడు కాలేదు



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు మొగలపూడి రాధ. మండల కేంద్రం పెదబయలులో కొన్నేళ్లుగా వస్త్ర వ్యాపారం చేస్తున్నారు. గతేడాది సంక్రాంతికి రూ.5 లక్షల మేర వస్త్రాలు దుకాణంలో అందుబాటులో ఉంచారు. పండగ నాటికి పూర్తిగా అమ్ముడయ్యాయి. అలాగా ఉంటుందని ఆశించి ఈ ఏడాది రూ.6లక్షల స్టాక్ తీసుకువచ్చారు. పండగ జరిగిన రెండు మూడు రోజుల్లో హోల్‌సేల్ వ్యాపారులకు స్టాక్ మొత్తానికి సంబంధించి డబ్బులు చెల్లించాలి. డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు రూ.లక్ష కూడా అమ్ముడు కాలేదు. వారికి ఎలా ఇవ్వాలో తెలియడం లేదని వ్యాపారి రాధ వాపోతున్నాడు. గిరిజనుల ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారడంతో ఇలాంటి ఎన్నో రంగాలపై తీవ్ర ప్రభావం చూపింది.

గిరిజన గ్రామాల్లో సంక్రాంతి పండగ సందడి కానరావడం లేదు. గత ఐదేళ్ల పండగలా సాగిన వ్యవసాయం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత గాడి తప్పింది. ఆర్థిక సహకారం కరువవడంతో గిరి రైతుల పరిస్థితి ఛిన్నాభిన్నమైంది. పెట్టుబడి సాయం అందక అప్పులు తీర్చేమార్గంలేక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. దీని ప్రభావం వల్ల అనుబంధ రంగాలన్నీ ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి.

- ఏదీ ఆనాటి సంక్రాంతి

పథకాలు లేవు పైసలు లేవు

కూటమి ప్రభుత్వంలో గిరిజనులకు దక్కని భరోసా

గ్రాండ్ సాక్షి రిపోర్ట్

- అందని పెట్టుబడి సాయం, అమ్మ ఒడి
- వెంటాడుతున్న ఆర్థిక ఇబ్బందులు
- పంట ఉత్పత్తులకు దక్కని గిట్టుబాటు ధర
- అప్పులు తీర్చే మార్గం లేక దయనీయంగా జీవనం
- పెదబయలులో అన్ని రంగాలపై తీవ్ర ప్రభావం



పండగ సందడి కానరాని మండల కేంద్రం పెదబయలు

సాక్షి,పాడేరు: గిరిజన గ్రామాల్లో సంక్రాంతి పండగ సందడి కరువైంది. అన్ని వర్గాల గిరిజనులకు ఈఏడాది కూటమి ప్రభుత్వం నిరాశే మిగిల్చింది. జిల్లాలో జనాభా 10.58 లక్షలు కాగా ఇందులో సుమారు ఏడు లక్షలకు పైగా వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారే. ప్రధానంగా గిరిజన రైతుల ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారడంతో దీని ప్రభావం అన్నిరంగాలపై చూపింది. ఖరీఫ్‌లో వాణిజ్య పంటల దిగుబడి తగ్గడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు కూడా గిట్టుబాటు ధరలు కరువయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. అమ్మఒడితోపాటు ఇతర డీబీటీ పథకాలు అమలు చేయకపోవడంతో గిరిజనులు ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. ఆ ప్రభావం కూడా సంక్రాంతి పండగపై చూపింది.

బోసిపోయిన పెదబయలు

ఏజెన్సీలోని ప్రధానమైన పెదబయలు మండల కేంద్రంలో సంక్రాంతి పండగ ఏమాత్రం కనిపించలేదు. కొనుగోళ్లు లేక వస్త్ర దుకాణాలు వెలవెలబోతున్నాయి. దుకాణదారులు రూ.6లక్షల వరకు దుస్తుల స్టాక్‌ను అందుబాటులో ఉంచారు. గత వారం రోజుల్లో కనీసం రూ.లక్ష కూడా అమ్మలేదని వస్త్ర వ్యాపారులు వాపోతున్నారు. భోగి ముందురోజు ఆదివారం కూడా దుకాణాలు కళ తప్పాయి. ఇతర వ్యాపారాల పరిస్థితి అదేవిధంగా ఉంది.

కానరాని శోభ

మండల కేంద్రం పెదబయలులో సంక్రాంతి శోభ కరువైంది. వ్యవసాయ పంటల దిగుబడులు లేక ఆదాయం కోల్పోయిన గిరిజన రైతుల ఇంట సంక్రాంతి పండగ సందడి కనిపించడం లేదు.

రైతుకు భరోసా లేదు



గత ప్రభుత్వంలో ఏటా రైతు భరోసా పథకంతో ఆర్థిక సాయం అందేది. కొత్త ప్రభుత్వం వ్యవసాయానికి పెట్టుబడి సాయం ఇవ్వకపోగా, పంటలకు గిట్టుబాటు ధరలను అమలుజేయలేదు.అధిక వర్షాలతో రాజ్‌మా,ఇతర వాణిజ్య పంటల దిగుబడులు భారీగా తగ్గిపోయాయి. చేతిలో డబ్బులు లేక సంక్రాంతి పండగకు ఇబ్బందులు పడాల్సిందే.

– చెండా కృష్ణారావు, గిరిజన రైతు, పెదబయలు

కొత్త దుస్తులు కొనలేదు



ఆర్థిక ఇబ్బందుల కారణంగా సంక్రాంతి కొత్త దుస్తులు కొనలేదు. రాజ్‌మా పంటకు నష్టం అధికంగా ఉండడంతో చేతిలో చిల్లిగవ్వ లేదు.గతంలో ప్రభుత్వ పథకాల ద్వారా బ్యాంకు ఖాతాల్లో నగదు నిల్వలు ఉండేవి. చంద్రబాబు ప్రభుత్వంలో పేదలకు ఎలాంటి సాయం లేదు. పిల్లలకు కూడా కొనలేకపోవడం ఎంతో బాధిస్తోంది.

– పాంగి కొండబాబు, గిరిజనుడు, పెదబయలు

పండగ కళ లేదు



సంక్రాంతి పండగ సమయంలో తమ గ్రామం ఎంతో సందడిగా ఉండేది. ప్రతి ఇంటి వద్ద ముందుగానే సంక్రాంతి పండగ కనబడేది. ఈఏడాది మాత్రం డబ్బులు లేక తామంతా ఇబ్బందులు పడుతున్నాం. ఇంటికి సున్నాలు కూడా వేయించలేదు. పూజ సామాన్లు మాత్రమే కొన్నా. కొడుకు, కోడలు, పిల్లలకు దుస్తులు కొనలేకపోయా.

– పాంగి కొండమ్మ, గిరిజన మహిళ, పెదబయలు



పెదబయలు గ్రామంలోని సీతగుంట వీధిలో కనిపించని పండగ సందడి



పెదబయలులో వెలవెలబోతున్న వస్త్ర దుకాణం

పేకాట, కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

సాక్షి,పాడేరు: సంక్రాంతి పండగ నేపథ్యంలో కోడిపందాలు, పేకాట, జూదం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పాడేరు సీఐ డి.దీనబంధు హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడిపందాలను ఎక్కడ నిర్వహించినా ఉపేక్షించేది లేదన్నారు. పాడేరు సర్కిల్ పరిధిలో పోలీసు బృందాల తనిఖీలు ముమ్మరం చేశాయని, మద్యం సేవించి వాహనాలను నడిపినా చర్యలు తప్పవన్నారు. సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లేవారు విలువైన బంగారం వస్తువులను తమ వెంట తీసుకువెళ్లాలని సూచించారు.

పాడేరు: సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా కోడి పందాలు నిర్వహించినా, పాల్గొన్నా చటరీత్యా నేరమని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ నర్సింహులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఆదేశాలను ఉల్లంఘించి కోడి పందాల శిబిరాలు నిర్వహిస్తే సెక్షన్ 10, గేమింగ్ యాక్ట్ 1974, సెక్షన్34 జంతుహింస నివారణ చట్టం 1960 ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామల్లో నిర్వహించే వేడుకల్లో కోడిపందాలు నిర్వహించకుండా వెటర్నరీ అసిస్టెంట్లు దృష్టి సారించాలని ఆయన కోరారు.

నేడు సింహగిరిపై సంక్రాంతి సంబరాలు


సింహాచలం : సింహగిరిపై సోమవారం ఉదయం సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నారు. రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో ఉదయం పెద్ద ఎత్తున భోగి మంటను వేయనున్నారు. అలాగే గొబ్బెమ్మలతో ముత్యాల ముగ్గులు, డూడూ బసవన్నల విన్యాసాలు, జంగమ దేవర, కొమ్మదాసరి, హరిదాసు వేషధారణలు, కపిలగోవు, కపిలగిత్త, ఎడ్లబండి, పూరిగుడెసల ప్రదర్శనలు కనువిందు చేయనున్నాయి. ఉదయం 9 గంటలకు చిన్నారులకు సామూహికంగా భోగిపళ్లు పోసే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

400 ప్రత్యేక బస్సులు నడిపిన ఆర్టీసీ

డాబాగార్డెన్స్ : సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఆర్టీసీ ద్వారకాబస్టేషన్ నుంచి 400 ప్రత్యేక సర్వీసులు నడిపినట్టు ప్రాంతీయ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. నాలుగు రోజులుగా హైదరాబాద్‌కు 25, విజయవాడకు 40 బస్సులు నడపగా, ఆదివారం శ్రీకాకుళం 100, రాజమండ్రికి 20, కాకినాడకు 20, పార్వతీపురానికి 40, పలాసకు 30, సాలూరుకు 30తో పాటు రద్దీ ఉన్న ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు నడిపినట్టు చెప్పారు. ద్వారకాబస్టేషన్లో ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు రీజియన్ పరిధిలో గల అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక సర్వీసులకు కూడా సాధారణ చార్జీలే వసూలు చేస్తున్నట్టు తెలిపారు. భోగి రోజు కూడా ప్రత్యేక సర్వీసులు రద్దీకి అనుగుణంగా నడపనున్నట్టు పేర్కొన్నారు.

నిలకడగా జోలాపుట్టు నీటిమట్టం

- జలాశయంలో పుష్కలంగా నిల్వలు
- గతేడాదికన్నా 23 అడుగుల నీరు ఎక్కువ
- మాచ్‌ఖండ్ ప్రాజెక్ట్‌కు వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



నిండుగా జోలాపుట్టు జలాశయం

ముంచంగిపుట్టు: ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరు అందించే ప్రధాన జోలాపుట్టు జలాశయంలో నీటి మట్టం నిలకడగా ఉంది.గతంతో పోలిస్తే ఈ ఏడాది జనవరి నెలలో నీటిమట్టం ఎక్కుగా ఉంది. గత ఏడాది వర్షకాలంలో భారీ వర్షాలకు వరద నీరు అధికంగా వచ్చి జోలాపుట్టు జలాశయంలో చేరడంతో నీటి స్థాయి పెరిగింది. ఈ ఏడాది వేసవిలో మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీటి సమస్య తలెత్తకుండా ప్రాజెక్ట్ అధికారులు ప్రణాళికపరంగా చర్యలు చేపట్టారు. జోలాపుట్టు జలాశయ నీటి మట్టం 2750 అడుగులు కాగా ఆదివారం నాటికి 2744.15అడుగులుగా నమోదయింది. గత ఏడాది ఇదే రోజుకు 2721.65 అడుగుల నీటి నిల్వ ఉండేది. గత ఏడాదితో పోలిస్తే 23 అడుగుల మేర నీరు ఎక్కువగా ఉంది. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం దిగువ ఉన్న డుడుమ జలాశయానికి ఒక గేట్లు ఎత్తి 13 వందల క్యూసెక్కుల నీటిని గత రెండు రోజులుగా విడుదల చేస్తున్నారు. డుడుమ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 2590 అడుగులు కాగా ప్రస్తుతం 2581.30 అడుగుల మేర నీరు ఉంది.మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఏడాది పొడవునా విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీరు అందుబాటులో ఉందని జలాశయ అధికారవర్గాలు తెలిపాయి.

నిరంతర సాధనతోనే క్రీడల్లో రాణింపు

- అరకు ఎంపీ గుమ్మా తనూజరాణి
- సీకరిలో క్రికెట్ పోటీలు ప్రారంభం

పెదబయలు: క్రమశిక్షణ,నిరంతర సాధనతోనే క్రీడల్లో రాణిస్తారని అరకు ఎంపీ గుమ్మా తనూజ రాణి అన్నారు. మండలంలోని సీకరిలో ఆదివారం ఆమె పర్యటించారు. గంగమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. వచ్చే నెల 9,10,11వ తేదీల్లో గంగమ్మతల్లి పండగ పురస్కరించుకొని ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించారు. జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీమాట్లాడుతూ క్రీడాకారులలో ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. గిరిజన యువతలో అపారమైన ప్రతిభ ఉందని, అందుకు తగ్గట్టుగా సాధన జరిగితే రాణింపు తథ్యమన్నారు.

గ్రామాల అభివృద్ధికి నిరంతర కృషి

సీకరిలో రచ్చబండ వద్ద ఆదివారం అరకు ఎంపీ తనూజరాణి గ్రామస్తులతో సమావేశమయ్యారు. పంచాయతీలోమస్యలను తెలుసుకున్నారు. గంగమ్మతల్లి దేవాలయానికి వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. సీకరిలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరు చేశానని, పన్నెడ గ్రామ సమీపంలో గంగమ్మతల్లి అమ్మవారి సింహాద్వారం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ఆమె అన్నారు. గతం అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ హయాంలో పంచాయతీని 80 శాతం మేర అభివృద్ధి చేశారన్నారు. ఫిబ్రవరిలో జరిగే గంగమ్మతల్లి అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించాలని, ఇందుకు అవసరమైన పూర్తి సహకారం అందిస్తానని ఆమె అన్నారు. అనంతరం సీకరి గ్రామ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ,గ్రామస్తులు ఆమెతోపాటు భర్త వినయ్‌లకు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కృష్ణారావు, సురేష్, వైస్‌ఎంపీపీ రాజుబాబు, మాజీ సర్పంచ్ సన్యాసి, ఎంపీటీసీ ఆనందరావు పాల్గొన్నారు.



సీకరిలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ గుమ్మా తనూజ రాణి..

- భోగభాగ్యాల భోగి.. సిరిసంపదల సంక్రాంతి



పాడేరు గుడివాడ చావిడిలో భోగి మంట

సాక్షి, పాడేరు/ముంచంగిపుట్టు: భోగభాగ్యాల భోగి.. సిరిసంపదల సంక్రాంతి వచ్చేసింది. జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి భోగి పండగ సందడి నెలకొంది. గిరిజన ఆచార సంప్రదాయం మేరకు పాడేరు పట్టణంలోని గుడివాడ చావిడి, లోచలిపుట్టు, పాతపాడేరు, కొత్తపాడేరు, రమణనగర్ ప్రాంతాల్లో శంకులమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ చావిడి వద్ద దుంగలు, కర్రలతో భోగి మంటలు వేశారు. ముంచంగిపుట్టులో ఏర్పాట్లు చేశారు.



ముంచంగిపుట్టులో సిద్ధం చేసిన కలప

జనవిహారి

ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలవిహారికి ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ ప్రకృతి అందాల మధ్య ఉల్లాసంగా గడిపారు. థింసా నృత్యం చేస్తూ గిరిజన కళాకారులు పర్యాటకులను అలరించారు. ఇక్కడికి సమీప అంజోడలో అటవీశాఖ ఏర్పాటుచేసిన అరకు పైనరీ కూడా సందర్శకులతో కళకళలాడింది. సంక్రాంతి సెలవులతో వీకెండ్ కావడంతో కొద్దిరోజులుగా తాకిడి నెలకొంది.

– డుంబ్రిగుడ



చాపరాయి వద్ద పర్యాటకుల సందడి



గిరిజన మహిళ వస్త్రధారణలో పర్యాటకులు



భారీగా తరలివచ్చిన పర్యాటకులు



గిరిజనులతో కలిసి పర్యాటకుల థింసా నృత్యం

కొత్తపల్లి కళకళ..



కొత్తపల్లి జలపాతానికి వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ప్రత్యేక వాహనాల్లో భారీగా తరలివచ్చారు. వ్యూపాయింట్, జలపాతం వద్ద సెల్ఫీలు, ఫొటోలు తీసుకుని ఉత్సాహంగా గడిపారు చీకులు, బొంగు చికెన్ భారీగా అమ్మకాలు జరిగాయి. – జి.మాడుగుల

క్లుప్తంగా

80 ట్రావెల్ బస్సులపై కేసులు నమోదు

● 3 రోజుల్లో రూ.14 లక్షల జరిమానా


ట్రావెల్ బస్సులను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

తుమ్మపాల: సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై చర్యలు తీసుకుంటున్నామని జిల్లా రవాణా శాఖాధికారి జి.మనోహర్ తెలిపారు. నిబంధనలను అతిక్రమించి, దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల నుంచి అత్యధిక చార్జీలు వసూలు చేసి, ఇబ్బందులకు గురి చేస్తున్న బస్సులపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. జిల్లాలో ప్రత్యేకంగా ఆరు బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 10 నుంచి చేపడుతున్న తనిఖీల్లో 80కి పైగా బస్సులపై కేసులు నమోదు చేసి, రూ.14 లక్షల జరిమానా విధించినట్లు చెప్పారు. ట్యాక్స్ బకాయిలు చెల్లించకుండా పర్మిట్ నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 20వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు.

తండ్రికి అంత్యక్రియలు నిర్వహించిన తనయ


తండ్రికి తలకొరివి పెడుతున్న లక్ష్మీ

మల్కాపురం : మృతి చెందిన కన్నతండ్రికి కూతురు తలకొరివి పెట్టిన ఘటన మల్కాపురంలో జరిగింది. గాంధీజీవీధికి చెందిన చొప్పా సూరిబాబు (60) అనారోగ్యంతో ఆదివారం కన్నుమూశారు. ఆయనకు కుమారులు లేకపోవటం, అల్లుళ్లు ముందుకు రాకపోవడంతో దుఃఖాన్ని దిగమింగుకొని కన్నకూతురే దహన సంస్కారాలు నిర్వహించింది. ఈ హృదయ విదారక ఘటన పలువురిని కంటతడి పెట్టించింది. ఆర్టీసీ అద్దె బస్సుకు సూరిబాబు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి ముగ్గురు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తె లక్ష్మి తండ్రికి అంత్యక్రియలు నిర్వహించి రుణం తీర్చుకుంది.

బెస్ట్‌గా రక్షణ్, రచిత్, జగదీష్

విశాఖ స్పోర్ట్స్: డీఎస్ఆర్ ట్రోఫీలో రక్షణ్, రచిత్, జగదీష్‌లు బెస్ట్‌లుగా నిలిచారు. ఆదివారంతో ముగిసిన ఈ ట్రోఫీలో జగదీష్ యాదవ్ 120 పరుగులతో పాటు పదిమందిని పెవిలియన్‌కు పంపి బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలిచాడు. ఐదు మ్యాచ్‌లాడి 229 పరుగులు చేసిన రక్షణ్ బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా నిలవగా... పిడి రచిత్ పదమూడు వికెట్లు తీసి బెస్ట్ బౌలర్‌గా నిలిచాడు. వైఎస్ఆర్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పీఎంపాలెం జట్టు నలభై ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 287 పరుగులు చేసింది. ప్రతిగా ఆశ్రయ సీసీ జట్టు 39.2 ఓవర్లలోనే 233 పరుగులకు ఆలౌటైంది. పీఎంపాలెం జట్టు తరఫున కశ్యప్‌ప్రకాష్ 7 ఫోర్లు 10 సిక్సర్లతో 121 పరుగులు చేసి మ్యాచ్ బెస్ట్‌గా నిలిచాడు. వీడీసీఏ ఉపాధ్యక్షుడు పి.వి.సుధాకర్ విజేతలకు ట్రోఫీలందించగా సంఘం ప్రతినిధులు పార్థసారథి, మౌళీ, బోగేంద్ర బాబు, పురుషోత్తం, అప్పారావు, జె.కె.ఎం. రాజు, మణికుమార్, ఎం.ఎస్.కుమార్ పాల్గొన్నారు.

నోరూరించే కుండెల బెల్లం

ప్రతి ఒక్కరూ బెల్లంతో కూడిన ఆహార పదార్థాల తయారీకి మొగ్గు చూపుతుంటారు. ఇది ఆరోగ్యానికి మంచిది కూడా. అదే సంక్రాంతి వంటి పర్వదినం సమయాల్లో బెల్లానికి మంచి గిరాకీ ఉంటుంది. సంప్రదాయకర వంటకాలను బెల్లంతో తయారీ చేస్తుంటారు. కె.కోటపాడు మండలం ఎ.కోడూరు గ్రామంలో కుండెల రూపంలో తయారు చేస్తున్న బెల్లం విశేష ఆదరణ పొందుతోంది.


కుండెల బెల్లం తయారీ


పెనంలో తయారీ చేస్తున్న బెల్లం

- సంక్రాంతికి మంచి డిమాండ్
- ఎ.కోడూరులో విస్తృతంగా తయారీ
- విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు ఎగుమతి

కె.కోటపాడు: బెల్లం తయారీ పలు రకాలుగా ఉంటుంది. అది వివిధ రూపాల్లోనూ ఉంటుంది. దిమ్మలు, కుండ, కుండెలు, తదితర ఆకారాల్లో తయారు చేస్తుంటారు. వీటిలో కుండెల రూపంలో తయారీ చేసే బెల్లానికి మంచి డిమాండ్ ఉంది. కేజీ బరువులో లభిస్తుండడంతో సంక్రాంతికి ఎక్కువగా విక్రయాలు జరుగుతున్నాయి. ఈ కుండెల బెల్లం తయారీకి ఎ.కోడూరు గ్రామం కేరాఫ్ అడ్రస్‌గా పేరొందింది. తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం ప్రాంతం నుంచి పలువురు తయారీదారులు ఎ.కోడూరు గ్రామానికి వచ్చి ఈ కుండెల బెల్లంను ప్రత్యేకంగా తయారీ చేస్తున్నారు. బంగారు వర్ణపు ఛాయలో కనిపించే ఈ బెల్లం కొనుగోలుదారులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ కుండెల బెల్లంను తయారీదారులు తక్కువ ధరకే కిలో రూ.42కే అమ్మకాలు చేస్తున్నారు. తయారీ కేంద్రం వద్దకే వచ్చి పలువురు కొనుగోలు చేస్తుంటారు. స్థానికంగా అమ్మకాలను చేయడంతో పాటు విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లోని పలు గ్రామాలకు ఇక్కడి కుండెల బెల్లంను తయారీదారులు అమ్మకాల కోసం తరలిస్తున్నారు. బెల్లం తయారీ కోసం నిర్వాహకులు గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి షేర్లు లేని రైతుల నుంచి టన్ను రూ.2800 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ బెల్లం తయారీలో తక్కువ మోతాదులో రసాయనాలు వినియోగిస్తున్నట్టు తయారీదారులు చెబుతున్నారు. ప్రతి ఏడాది డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకూ ఈ కుండెల బెల్లంను తయారు చేస్తుంటారు.

నాణ్యతగా బెల్లం తయారీ



బెల్లంను తయారీ పూర్తి నాణ్యతతో ఉంటుంది. మార్కెట్‌లో బంగారు వర్ణపు ఛాయలో ఉండే ఈ బెల్లంను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతారు. కుండెల రూపంలో బెల్లం తయారీ కొంచెం కష్టంతో కూడుకున్న పని. తక్కువ ధరకే అమ్మకాలు చేస్తున్నాం. విశాఖపట్నం, విజయనగరం ప్రాంతాలలో వ్యాపారులకు ఇక్కడి నుంచే కుండెల బెల్లంను పంపిస్తున్నాం. ఫ్యాక్టరీ షేర్లు లేని రైతుల వద్దనే చెరకును కొనుగోలు చేసి బెల్లంను తయారు చేస్తున్నాం. టన్ను చెరకు నుంచి 100 కిలోల బెల్లం కుండెలు వస్తాయి.

– గరగ వీరన్న, బెల్లం తయారీదారుడు

రెండు బైకులు ఢీకొని యువకుడి మృతి

మరో ముగ్గురికి తీవ్ర గాయాలు


జగదీష్ (ఫైల్)

ఎస్.రాయవరం : గుర్రాజుపేట జంక్షన్ సమీపంలో రేవు పోలవరం ఆర్అండ్‌బీ రోడ్డుపై శనివారం అర్ధరాత్రి జరిగిన ఘటనలో యువకుడు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ విభీషణరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. రేవు పోలవరం గ్రామానికి చెందిన యువకులు అడ్డురోడ్డు నుంచి రేవుపోలవరం బైకులపై వెళుతుండగా గుర్రాజపేట జంక్షన్ సమీపంలో కొబ్బరి పీచు ఫ్యాక్టరీ సమీపంలో ఒకదాని వెంట మరొకటి బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో బైకుతో మరో బైకును ఢీకొట్టిన పల్లేటి జగదీష్ (20) అక్కడికక్కడే మృతి చెందాడు. ఇరువురి బైకులపై ప్రయాణిస్తున్న హర్షిత్‌కుమార్, ఎరిపల్లి వాసులకు తీవ్రగాయాలు కాగా, మరో యువకుడు ఇజ్రాయిల్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. వీరిని 108 వాహనంతో స్థానికులు నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, తీవ్రంగా గాయపడిన వారిని విశాఖపట్నం ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నట్టు చెప్పారు. జగదీష్ మృతదేహానికి పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు జగదీష్

యువకుడి అనుమానాస్పద మృతి


అప్పన్న (ఫైల్)

నర్సీపట్నం: నర్సీపట్నం మండలం వేములపూడి గ్రామంలో ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. బంధువుల కథనం ప్రకారం.. బండారు అప్పన్న(30) పశువుల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం రోజూ మాదిరిగానే మృతుడు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 10.40 గంటల సమయంలో తన ఇంటికి వంద మీటర్ల దూరంలో సీసీ రోడ్డుపై అప్పన్న రక్తపు మడుగులో పడి ఉన్నాడు. మేనమామ గోవింద, కుటుంబ సభ్యులు వెళ్లి చూసేసరికి కొన ఊపిరితో ఉన్నాడు. ఆస్పత్రికి తరలించేందుకు 108 వాహనానికి ఫోన్ చేశారు. నర్సీపట్నం అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో నాతవరం మండలం నుంచి అంబులెన్స్ రావడం ఆలస్యమైంది. తీరా ఘటనా స్థలానికి వచ్చిన అంబులెన్స్‌లో ఎక్కించేందుకు సిద్ధపడుతుండగా అప్పన్న ప్రాణాలు విడిచాడు. మృతుడు కుడి చేయి విరిగిపోవడంతో పాటు మొహం అంతా చితికిపోవటం, తల వెనుక పెద్ద గాటు ఉండడంపై కుటుంబ సభ్యులు ఎవరో కొట్టి పడేశారనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అలాగని ఊరులో ఎవరితోనూ మృతుడికి గొడవలు లేవని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అప్పన్నకు వివాహం కాలేదు. తల్లిదండ్రులు మహాలక్ష్మి, ఆదిలక్ష్మి, సోదరుడు రమణ, ముగ్గురు అక్కచెల్లెళ్లు ఉన్నారు. డీఎస్పీ మోహన్, సీఐ రేవతమ్మ, ఎస్ఐ రాజారావు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని సీఐ రేవతమ్మ తెలిపారు.

17 నుంచి కళాభారతిలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు


ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాభారతి ట్రస్ట్ ప్రతినిధులు

మద్దిలపాలెం : త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు ఈ నెల 17 నుంచి 23 వరకూ మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్నామని ట్రస్ట్ ప్రతినిధులు ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్మలూరి రాంబాబు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది ఏడురోజులు పాటు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ ఏడాదికి గానూ ప్రతిష్టాత్మక సంగీత కళాభారతి అవార్డును ప్రముఖ నాదస్వర విద్వాంసుడు గురువిళ్ల అప్పన్నకు ఇవ్వనున్నామన్నారు. వారం రోజులపాటు 404 సంగీత కచేరీలు నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి పంతులు గోపాలరావు, ట్రస్టీలు పైడా కృష్ణప్రసాద్, మల్లిక గ్రంధి పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగుల తొలగింపు తగదు

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులను బలవంతంగా తొలగించేందుకు బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న వలంటరీ రిటైర్మెంట్ స్కీంను తక్షణమే నిలిపివేయాలని చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న జేఏసీ దీక్షా శిబిరంలో ఆదివారం విశాఖ డెయిరీ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వీఆర్ఎస్ జీవో కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ విశాఖ పర్యటన అనంతరం ఉద్యోగులను తొలగించే ప్రక్రియకు రాత్రి రాత్రే జీవో జారీ చేయడం దారుణమన్నారు. ఏడు వేల మందిని చేర్చుకునే అవకాశం ఉన్నా..ఉద్యోగులను, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడానికి పూనుకోవడం తగదన్నారు. కేంద్రం కుట్రలకు పాల్పడుతున్న స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని చెబుతున్న కూటమి ప్రభుత్వం ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. తక్షణమే స్టీల్‌ప్లాంట్‌కు ఇచ్చిన వీఆర్ఎస్‌ను ఉపసంహరించుకునేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.రమణ, అధ్యక్షుడు కె.వరహామూర్తి, పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, విశాఖ డెయిరీ నాయకులు వి.నారాయణ, డి.నాగమణి బాబూ పాల్గొన్నారు.


వీఆర్ఎస్ జీవో కాపీలను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

మనసే కోవెలగా..


గ్రామాల్లో మేలుకొలుపు


కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

- గ్రామగ్రామాన ఆధ్యాత్మిక సౌరభాలు
- మార్మోగుతున్న హరినామ సంకీర్తనలు
- మేలుకొలుపులతో మానసిక ప్రశాంతత


సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

అచ్యుతాపురం: గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి వెల్లివిరుస్తోంది. భక్తి పారవశ్యం మానసిక ప్రశాంతత చేకూరుస్తోంది. సనాతన సంప్రదాయాలకు మళ్లీ పెద్దపీట వేస్తూ దేవుని పూజలతో తన్మయత్వం పొందుతున్నారు భక్తులు. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ ధనుర్మాసం పూజల్లో నిమగ్నం అవుతున్నారు. పెద్ద పండుగ ముందు పల్లెలన్నీ హరినామ సంకీర్తనతో మార్మోగిపోతున్నాయి. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేలుకొలుపు కార్యక్రమాలు అన్ని గ్రామాలకు విస్తరిస్తున్నాయి. చలికాలం వచ్చిందంటే కాసింత వెచ్చని ఎండ వచ్చే వరకూ నిద్ర లేవని వారు సైతం హరినామ సంకీర్తనలో మమేకం అవుతున్నారు. అచ్యుతాపురం మండలంలోని జగ్గన్నపేటలో ఐదేళ్ల క్రిందట ప్రారంభమైన మేలుకొలుపులు ఇప్పుడు మండలంలోని 12 గ్రామాలకు పైగా విస్తరించింది. తిమ్మరాజుపేట, హరిపాలెం, జగన్నాథపురం, కొండకర్ల, ఎర్రవరం, ఉప్పవరం, చీమలాపల్లి, దుప్పుతూరు, దోసూరు, గండివానిపాలెం, నరేంద్రపురం గ్రామాల్లో మేలుకొలుపులు నెలగంట కొట్టిన రోజు నుంచి ప్రారంభమయ్యాయి. ఉత్తరాయనంలో 6 నెలల పాటు దేవతలు సంచరించే సమయంలో సూర్యుడు మకర రాశిలో ప్రవేశించినప్పుడు దేవుడిని ఆరాధిస్తే మంచి జరుగుతుందనేది భక్తుల నమ్మకం. మేలుకొలుపు కార్యక్రమం వల్ల తెల్లవారుజాము నుంచే భక్తులు లేచి పుణ్యస్నానాలు ఆచరించి హరినామ సంకీర్తన చేస్తున్నారు. అయ్యప్ప మాలధారులు స్వామి సన్నిధికి వెళ్లిన తర్వాత మళ్లీ భక్తితత్వంలో కొనసాగేందుకు మేలుకొలుపులు ఉపయోగపడుతున్నాయని సమరసత సేవా ఫౌండేషన్ యలమంచిలి డివిజన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు చెబుతున్నారు. అన్ని వర్గాల ప్రజలకు మానసిక ప్రశాంతత, ఉల్లాసం లభిస్తోందని భక్తులు పేర్కొనడం గమనార్హం.

హరిదాసుల సందడి

నెలగంట పెట్టిన రోజు నుంచి గ్రామాల్లో హరిదాసుల సందడి మొదలయ్యింది. అక్షయ పాత్రను తలపై పెట్టుకొని హరినామస్మరణతో వీధుల్లో సంచరిస్తూ ఆధ్యాత్మిక సౌరభాలను వెదజల్లుతున్నారు. గంగిరెద్దుల సందడి, గాలిపటాలతో చిన్నారుల కోలాహలం, ముగ్గుల పోటీల్లో మహిళల కళా కౌశలం ఊరూరా ప్రతిఫలిస్తోంది. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏకాదశి రోజున నగర సంకీర్తన, వారం వారం భజనలు, పౌర్ణమి రోజున సామూహిక హారతి, సత్సంగం, కార్తీక పౌర్ణమి రోజున వెన్నెలలో పాలను మరిగించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు గ్రామాల్లో మహిళలు కీర్తనలు, కోలాటాలు నేర్చుకొని దేవాలయాల్లో ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇది కూడా వారిలో భక్తి భావం పెంపొందించడంతో పాటు, శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడుతోంది.


హరిదాసుల అక్షయ పాత్రలో బియ్యం వేస్తున్న మహిళ

15న అప్పన్న మకరవేట ఉత్సవం


ఉత్సవం జరిగే ప్రధాన మండపం

సింహాచలం: కనుమ పండగను పురస్కరించుకుని ఈనెల 15వ తేదీన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మకరవేట(గజేంద్రమోక్షం) ఉత్సవం కొండదిగువ పూలతోటలో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి వరదరాజస్వామి అలంకరణ చేసి బుధవారం సాయంత్రం కొండదిగువకి మెట్లమార్గం ద్వారా తీసుకొస్తారు. కొండదిగువ ఉన్న పూలతోటలోని ప్రధాన మండపంలో స్వామిని వేంజేపచేసి గజేంద్రమోక్షం ఉత్సవాన్ని నిర్వహిస్తారు. స్వామికి విశేష పూజలు చేస్తారు. అనంతరం స్వామిని పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి గజవాహనంపై అధిష్టిస్తారు. తరువాత అడవివరం గ్రామ పురవీధిల్లో గజవావానంపై స్వామికి తిరువీధి నిర్వహిస్తారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని పూలతోట ముస్తాబు చేశారు. కాగా గజేంద్రమోక్షం ఉత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే సింహగిరిపై స్వామివారి మూల విరాట్ దర్శనాలు లభిస్తాయి.

పండగ వేళ విషాదం

మధురవాడ: పండగవేళ ఆ కుటుంబంలో విషాదం నెలకుంది. మేడ పైనుంచి వివాహిత మృతి చెందడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపించింది. పీఎంపాలెం ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు..విజయవాడ సత్యనారాయణ పురంలోని ఓగిరాల వీధికి చెందిన కొంజేటి వేణుగోపాల కృష్ణమూర్తి, భార్య సుధ పండగ నేపథ్యంలో విశాఖలోని మధురవాడ ఐటీ సెజ్ సమీపంలో వుడా హరిత అపార్ట్‌మెంట్ నివాసముంటున్న పెద్ద కుమారుడు వెంకట్ సాయిసందీప్ ఇంటికి శుక్రవారం వచ్చారు. సందీప్ గీతం వైద్య కళాశాలలో ఎనస్థిషియన్‌గా పనిచేస్తున్నాడు. సుధకు బీపీ, థైరాయిడ్, షుగర్ పాటు మోకాలి నొప్పులు కూడా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో తన భార్యకు ఇన్సులిన్ ఇవ్వాలని వెతకగా..ఇంట్లో కనిపించలేదు. బయటకు వచ్చి చూడగా రక్తపు మడుగులో సుధ కనిపించింది. ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్‌కు ఫోన్ చేయగా..వారొచ్చి పరీక్షించారు. అప్పటికే సుధ మృతి చెందినట్టు వైద్య సిబ్బంది నిర్ధారించారు. కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మేడ పైకి వెళ్లగా..కళ్లు తిరిగి పడిపోయి ఉంటుందని, ఆమె మృతిపై ఎటువంటి అనుమానాలు కృష్ణమూర్తి ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

తీరంలో బోటు బోల్తా

కొమ్మాది : మంగమారిపేట బీచ్‌లో ఇంజిన్ బోటు బోల్తా పడింది. బోటు యజమాని సూరాడ హరిబాబు తెలిపిన వివరాలు ప్రకారం శనివారం తన ఇంజిన్ బోటులో 20 మందితో వేటకు వెళ్లి.. తిరిగొచ్చి తీరంలో లంగరు వేసి ఉంచామన్నారు. ఆదివారం తెల్లవారు జామున వేటకు వెళ్లేందుకు తీరప్రాంతానికి వచ్చేసరికి కిలోమీటరు దూరంలో బోటు బోల్తా పడి ఉందని, వెంటనే తనతో పాటు వచ్చినవారంతా కలిసి మూడు బోట్ల సాయంతో తాళ్లు కట్టి తీరానికి తీసుకొచ్చామన్నారు. తీరంలో బలమైన ఈదురు గాలులు ప్రభావంతోనే బోటు బోల్తా పడిందని, వీటి వలన వలలు, బోటు కొంత మేర దెబ్బతిన్నాయని, సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని హరిబాబు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నృసింహ దీక్షల విరమణ


కుంభప్రోక్షణ నిర్వహిస్తున్న అర్చకులు


సింహగిరిపై ఇరుముడులతో వెళ్తున్న దీక్షదారులు

సింహాచలం : సింహగిరిపై మాలధారులు శ్రీ నృసింహ దీక్షలు విరమించారు. 41 రోజుల మండల దీక్ష, 32 రోజుల దీక్ష ధారులంతా శిరస్సుపై తిరుముడులను పెట్టుకొని సింహగిరికి తరలివచ్చారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి వాటిని సమర్పించి దీక్ష విరమించారు. వారికి ఉచితంగా అంతరాలయ దర్శనాన్ని దేవస్థానం కల్పించింది. అనంతరం శ్రీగోకులంకి సమీపంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద వైదికులు దీక్ష ధారులందరిచేత శాస్త్రోక్తంగా దీక్ష విరమింపజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలు, విశాఖ ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులు, ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున దీక్షధారులు సింహగిరికి తరలివచ్చారు. సింహాచలానికి చెందిన చందన పెరుమాళ్ పీఠం గురుస్వామి సానబోయిన రాజు, సింహాద్రి మఠం గురుస్వామి కళిరెడ్డి సురేంద్ర, శ్రీనృసింహ పెరుమాళ్ పీఠం గురుస్వామి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దీక్షధారులు హరినామస్మరణలు చేసుకుంటూ తిరుముడిలతో సింహగిరికి తరలివెళ్లారు.

శ్రీనృసింహ హోమం, శాంతి కల్యాణం

శ్రీనృసింహ దీక్షల విరమణను పురస్కరించుకుని ఆలయ కల్యాణమండపంలో శ్రీనృసింహ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. మహా పూర్ణాహుతి, కుంభప్రోక్షణను నిర్వహించారు. అలాగే స్వామివారి శాంతి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. తిరుముడులతో సుభదా కాంప్లెక్స్‌లోనుంచి అంతరాలయంలోకి వెళ్లే దీక్షధారులందరినీ కల్యాణమండపంమీదుగా పంపించి శ్రీనృసింహ హోమం, శాంతి కల్యాణం తిలకించే విధంగా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఏఈవో వి.త్రినాథరావు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.